**జరిగిన కథ :** శ్రీదర్శనుడు కారణజన్ముడై పుట్టాడు. మాళవ రాజ్యానికి చేరి, అక్కడి రాజుకు క్షయరోగాన్ని పోగొట్టాడు. దాంతో మాళవ రాజయ్యాడు. అతనికి లభించిన విగ్రహానికి గుడి కట్టించాడు. ఆ విగ్రహం యజమానురాలైన అనంగలతికను స్వప్నంలో చూసి, మోహించాడు. వాళ్లిద్దరికీ పెళ్లయింది. చివరికి ఒకరోజు అనుకోకుండా శ్రీదర్శనుడి భార్యలిద్దరూ మరణించారు. విరక్తుడై అతను అరణ్యాల పాలయ్యాడు.







# నలకూబరుని శాపం

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

''స్వామీ! ముందుగా మీరీ పళ్లు తినండి. తరువాత మేమెవరమో చెబుతాం'' అన్నారు దివ్యకన్యలు.

''కుదరదు. నేనీ పళ్లను స్వీకరించాలంటే.. మీరెవరో నాకు తెలియాలి'' అన్నాడు శ్రీదర్శనుడు.

''మీరు మావెంట మా ఇంటికి దయచేస్తే అలాగే చెప్పగలం'' అన్నారు వాళ్లు.

శ్రీదర్శనుడు వారివెంట బయల్దేరాడు. రావిచెట్టుకు కొంతదూరంలో భూమిలో సహజమైన బిలమార్గం కనిపించింది. దానివెంట లోపలికి వెళ్లగా స్వర్ణమయమైన భవంతి కనిపించింది. అక్కడ శ్రీదర్శనుడిని కూర్చోబెట్టి ఆ దివ్యకన్యలు తమ కథను చెప్పసాగారు.

* * *

పూర్వం ప్రతిష్ఠానపురంలో పవిత్రాధరుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతను పుట్టుకతోనే నిరుపేద. వయసు ముదిరేకొద్దీ తాను ధనవంతుణ్ని కాలేకపోయానన్న బాధ పెరగసాగింది. దాంతో అతనొక తాంత్రికుణ్ని ఆశ్రయించి.. ఐశ్వర్యాన్ని పొందేందుకు ఏదైనా మంత్రం ఉపదేశించమని కోరుకున్నాడు.

అందుకాయన..

''అబ్బాయీ! సముద్రంలో మునిగినా, మేరు శిఖరమెక్కినా, శత్రువులను జయించినా, వ్యవసాయం వాణిజ్యం వంటివి చేసినా, పక్షిలా ఆకాశానికి ఎగిరినా.. ఎవరికి ఎంతప్రాప్తమో అంతే దక్కుతుంది. దైవం మన నుదుటిమీద ఏది రాశాడో అది కొంచెమే అయినా, చాలా అయినా శ్మశానంలో ఉన్నా వస్తుంది. మేరుపర్వతం ఎక్కినా అంతకంటే ఒక్కపిసరు ఎక్కువరాదు. అయినా నువ్వు కోరావు కాబట్టి నీకొక యక్షిణీ సాధక మంత్రాన్ని ఉపదేశిస్తాను. నెలరోజులపాటు ఆ మంత్రాన్ని జపించి, జాజిపూలతో హోమం చేయాలి. అప్పుడు దేవత ప్రత్యక్షమై నువ్వు కోరిన కోర్కెలు నెరవేరుస్తుంది. కానీ జాగ్రత్త సుమా! మంత్రసాధనలో అనేక భ్రమలు కలుగుతాయి. వాటికి లోబడిపోయి జపం విఘ్నమైందంటే దేవత నిన్ను అణగదొక్కేస్తుంది'' అని హెచ్చరించి తగిన విధానం ఉపదేశించాడు.

పవిత్రాధరుడు ఆ మంత్రాన్ని శ్రద్ధగా జపించసాగాడు. అతని దీక్షను భంగం చేయడానికి యక్షిణీ దేవత అనేక ఆటంకాలు కల్పించింది. కానీ అతని మొక్కవోని దీక్షముందు అవేవీ నిలవలేకపోయాయి. హోమం పూర్తయ్యే సమయానికి దేవత ప్రత్యక్షమై చేతులు కట్టుకుని..

''దేవా! నేను నీకు కింకరురాలినయ్యాను. ఏం చేయాలో తెలపండి'' అన్నది.

అప్పుడు కూడా ఆ బ్రాహ్మణుడు హోమాన్ని ఆపలేదు. చివరికి యక్షిణి దివ్యరూపంతో ప్రత్యక్షమైంది.

''ప్రాణేశ్వరా! నేనే నీకు భార్యనయ్యాను. నాతో నువ్వు అభీష్ట కామాలను నెరవేర్చుకోవచ్చు. నువ్వు కోరిన వినోదాలన్నీ నేను కల్పించగలను'' అన్నది.

అతను కోరినంత ధనమిచ్చింది. పవిత్రాధరుడు ఆమెతో మానవాతీతమైన సౌఖ్యాలను అనుభవించసాగాడు. చివరికి అతనికి కొడుకును ఎత్తుకోవాలనే కోరిక కలిగింది. ఆ సంగతి యక్షిణికి తెలియచేశాడు.

అప్పుడామె..

''నువ్విలాంటి కోరిక కోరుకోవడం కూడా దైవనిర్దేశమే. నీకిప్పుడు నీ పూర్వజన్మ గురించి చెప్పాల్సి ఉంది'' అంటూ ఒక కథ చెప్పింది.

..పూర్వం ప్రతిష్ఠానపురంలోనే కమలగర్భుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతనికి పద్మ, బల అని ఇద్దరు భార్యలు. ఆ దంపతులకు ఒకరిపై మరొకరికి అంతులేని ప్రేమానురాగాలు ఉండేవి. వారికి పెద్దవయసు వచ్చిన తరువాత.. తమలో ఎవరు ముందుగా మరణిస్తారో.. ప్రియతముల మరణాన్ని కళ్లారా చూడాల్సి వస్తుందే అనే చింత బయల్దేరింది.

ఎవరికి వారే ముందుగా తామే మరణించాలని కోరుకున్నారు. చివరికి ముగ్గురూ కలిసి ఒక నిర్ణయానికి వచ్చారు. ప్రయాగలోని త్రివేణీసంగమం వద్ద వటవృక్షంపైకి ఎక్కి..

'జన్మజన్మలకూ మేమే భార్యాభర్తలుగా పుట్టాలి' అని కోరిక చెప్పుకొని నీళ్లలోకి దూకి ప్రాణాలు విడిచిపెట్టారు.

ఆ పుణ్యం వల్ల ఆ బ్రాహ్మణుడు.. యక్షులలో దీప్తశిఖుడనే పేరుతో పుట్టాడు. ఇక వాని భార్యలు జ్యోతిర్లేఖ, ధూమలేఖ అనే పేర్లతో జన్మించారు. ఆ దీప్తశిఖునికి అట్టహాసుడనే అన్నయ్య ఉండేవాడు.